# దురంతం

మంచిరాజు నరసింహారావు

పదిమందిలోనూ శాంతమూర్తి అని పేరు తెచ్చుకున్న విశ్వనారాయణ గారు, తన కుమారుడు దశరథరావు పేరువింటేనే రౌద్రరూపం దాలుస్తున్నాడు. అడ్డాలనాడే బిడ్డలు గానీ... అని ఎంతోమందికి నచ్చచెప్పిన పెద్ద మనిషి తన స్వంత విషయంలో ప్రత్యక్షంగా విరుద్ధ చర్యకు పూనుకుంటున్నాడు. ఘనత వహించిన ఆయన పేర్మి ఓర్మి క్షణంలో మటుమాయమవటం ఆయన్ని అన్ని విషయాలలోనూ సమర్థించే వాళ్లు కూడా సహించలేకపోతున్నారు.

తీరుబడిగా వాకిట్లో అరుగు మీద కూర్చుని వచ్చేపోయే వాళ్ళని పనిగట్టుకుపిలిచి వాళ్ళతో సంభాషణప్రారంభించి, పట్టుబలవంతాన తన కుమారుడు దశరథరావుని మాటలలోకి తెప్పించి ఆ తల పెద్దమనుషులు బహిరంగంగా తమ అయిష్టాన్ని ఎంత ప్రకటించినా వినిపించుకోకుండా అదేధోరణిలో తన నోటికివచ్చినన్ని బూతులన్నీ తిడ్తూ కూర్చోవటం విశ్వనారాయణ గారికి కొద్దిరోజులుగా దినచర్యఅయి కూర్చుంది; ఊసుపోక ఊరికే కాలాన్ని దొర్లించేందుకు ఆయన దగ్గర చేరిన పనిలేని మనుషులికి సైతం ఆయన మాటల్నివినేసరికి ఊసు పోక పోవటం మానిరి కదా, ఊపిరి సల్పుకోవటానికి కూడా వ్యవధి లేనంతగా దుర్భరమై కూర్చుంది. మనిషంత మనిషి తనుయెదురుగా కష్టసముద్రంలోపడి బుటకలు వేస్తూంటే ఊరికే కళ్లూ, చెవులూ అప్పగించవలసివచ్చిన దౌర్భాగ్యం అవహించింది, ఆ వినే పెద్ద మనుషులనందర్నీనూ. వాళ్ళు ఎన్ని గంటలు సానుభూతితో పెదవిచప్పుళ్లు చేసినా కూడా, తనకు సంక్రమించిన దుష్టసంఘటనకిసరిపోయె సానుభూతి రాలేదని కాబోలు, చెప్పిందే చెప్పి దేవుళ్లాడుతున్నారు విశ్వనారాయణ గారు. తెల్లవారితే ఒకళ్ల మొఖాలొకళ్లు చూసుకోవాలికదా అనేదృష్టితో ఆయన చుట్టూ చేరివినేవాళ్లు విన్నదే విని, లేదా, వినకపోయినా వింటూన్నట్లు నటిస్తూ, సోములోరి ముందు ఉపదేశానికి కూర్చున్న భక్తచింతామణుల్లా ఊకొడ్తూ ఉపవిష్టులవుతున్నారు. ఆయనవల్లెవేసేది బూతుల పురాణమైనా శ్రద్ధాళువులై ఆలకించవలసిన తత్వపరాయణులైనారు - కొంతమంది పెద్దమనుషులు. ఒకవిధంగా తూచిచూస్తే, ఆ కుగ్రామంలో ఒక మహావిప్లవ ఝుంఝూమారుతం ప్రవేశించి, ఆ బాలగోపాలాన్నీ ఉర్రూతలూగించి, తన ప్రచండ రూపాన్ని ప్రతి యింటి మారు మూలలోనూ ప్రదర్శించి తీరుతోంది.

విశ్వనారాయణగారు మధ్యతరగతి కుటుంబీకుడైన, తనకున్న కొద్దిపాటి ఆస్థిలోనే ఒక ఉన్నత తరహా జీవితాన్ని జీవిస్తూ వస్తున్నాడు. వంశ పారంపర్యంగా తనకు సంక్రమించిన సద్బ్రాహ్మణ సాంప్రదాయాన్ని తనచేతి వ్రేళ్ల మధ్య అనునిత్యం ఉంగరాలుతిరిగే రుద్రాక్షమాలలోనూ, తన దేవతార్చన గదిలో ప్రతిక్షణం ప్రజ్వలిల్లే నిత్యాగ్నిహోత్రంతోనూ కాపాడుకుంటూవస్తున్నాడు. అయితే తనపారలౌకిక క్రతుహోమాది కలాపానికీ, తనఇహలోక తత్వసంవిధానానికీ నడుమమంచి పసందైన వారధిని సృజించు

కుని, అటు ఇహానికీ, ఇటుపరానికీ తగినట్లుగా లౌకికుడుగానూ, పారలౌకికుడుగాను జీవిస్తూవస్తున్నాడంటే, అది ఆయనచేసుకున్న పూర్వజన్మ సుకృతమే అనాలి. లేకపోతే అంత ఛాందస కర్మ పరాయణుడికీ, తనఊరిలో అంతపలుకుబడి సాధ్యమయిందంటే, పదిమందికీ ఉపయోగకారి అయ్యాడంటే విచిత్రంకాదూ? దీన్ని భౌతిక| సిద్ధాంతరూపేణా నిర్వచించాలంటే, ఆయనచిన్నప్పటినుంచీ ప్రాంశరీ నోటులులగాయతు తనఖాదస్తావేజులవరకూ అసమాన ప్రజ్ఞతో నిర్వహించి, రెండుకక్షులమధ్య పెరిగిన వివాదాలను యిద్దరికీ శ్రేయస్కరంగా పరిష్కరించి, అందరికీ తలలో నాలుకలా సంచరించడమే కారణమని సూచించవచ్చు. అయితే అటు అలౌకిక కార్య తత్పరతకీ, ఇటు లౌకికగహనాయాసానికీ ఎలాపొత్తు కలిసి ఆయనలో మూర్తీభవించాయేమాత్రం కారణ కార్యవాదం నిరూపించలేదు.

ఇంతకీ విశ్వన్నారాయణగారు చాలా కష్టకాలంలో ఉన్నారిప్పుడు. కొద్ది రోజులనుంచీ ఆయన జపంచెయ్యడానికి మారుగా తనకుమారుడి అశ్లీలచర్యని సవిమర్శకంగా ఖండించడంలో సరిపెట్టుకుంటున్నారు. దీనివల్ల ఇంట్లో జానికమ్మగారు వేళకి భోజనం వండటం కూడా సవ్యంగాసాగటంలేదు. అరుగుమీదిపెద్ద మనుషులు భోజనంవేళకి వాళ్ళఇళ్ళకి చేరుకుంటే, ఆయన అమాంతంగా వంటింట్లో ప్రవేశించి, జానికమ్మగారి మీద తీరని తనరోషాన్ని ప్రయోగిస్తున్నాడు. దశరథరావు వంటి దుష్ట పుత్రుణ్ణి కనందుకు, ఆమె కుళ్ళి కుళ్ళి ఏడ్వాలనీ, అంతగా భరించలేకపోతే ఏనుయ్యో గొయ్యో చూసుకోవాలనీ, తన లౌకికప్రౌఢవాగ్ధాటి మాగరిమతో ఆమెను నిలువునీరయ్యేటట్లు చేస్తున్నాడు. ఆమె కళ్ళవెంబడి అశ్రుఝరులు ప్రవహించి, ఆమె చీర కొంగులు తడిసిపోయినా, తను పడినబాధలో వెయ్యోవంతు ఆమెపడటంలేదని ఉపన్యాసమిస్తున్నాడు. తనకుమారుడు తనకి దూరమైనందుకు తనలో గంపెడు దుఃఖంతో క్రుంగిపోయే జానికమ్మ తన భర్త ప్రతిక్షణం విసరివేసే సూటిపోటి మాటలను తాళలేకపోతోంది.

నిజానికి దశరథరావు బ్రాహ్మణసాంప్రదాయానికి విరుద్ధమైన పోకడే పోయాడు, తను చేసినదానికి తను అనుభవించకుండా పిరికిపందలా ఎక్కడికో పారిపోయి, దుర్భరమైన శోకాన్నీ, క్షోభని తన తల్లి అనుభవించే రీతిగా ప్రవర్తించాడు. తనతండ్రిస్వభావాన్ని అతను పూర్తిగా అర్థం చేసుకునే అంతగా దిగజారిపోయాడు. ప్రపంచంలో ప్రతి అణువూ మార్పులోనై మరో పరిణామం చెందుతుంది కాని తన తండ్రి చాదస్తతత్వం కొంచమైనా సడలి పోతుందని అతడెన్నడూ ఆశించలేదు. విజ్ఞానఖని అని పేరుపొందిన దశరథరావు, ఇంతపామరచైద్యానికిపూనుకుంటాడని అతనిస్నేహితులు సైతంఊహించలేకపోయారు. తనకు తోచిందే చేసే మంకు పట్టు ప్రవృత్తికాక, హేతువుకు ఉచితస్థానమిచ్చే అతను ప్రవర్తిస్తాడని అందరికీ తెలుసును. విద్యార్థుల్నందర్నీ ఒక్క పెట్టున తిట్టిపోసే ప్రొఫెసర్లు సైతం, దశరథరావు పొందివున్న ప్రశాంతాది సద్గుణాల్నీ వేనోళ్ళా పొగిడారు. కళాశాలాజీవితంలో అతడు స్వీకరించిన మన్ననల్ని బహుశా మరొక విద్యార్థి స్వీకరించి ఉండబోడు. అతని వాక్చాతుర్యానికి మురిసిపోతూ, అతని కవితాధోరణికి ఆశ్చర్యపోతూ, అతని మేధస్సంపదకి జోహారులర్పిస్తూ, తమ ఆదరాభిమానాల్ని ప్రదర్శించేవారూ; ప్రదర్శించనివారూకూడా కొద్ది రోజులక్రితం అతడు సాహసించిన కార్యక్రమాన్ని హృదయపూర్వకంగా ఆమోదించకపోయారు. కొంతమంది అతనిచర్యని బాహాటంగా తునుమాడడం మొదలుపెట్టారు. మరికొంతమంది అతనికి ఆజన్మాంతరం శత్రువులుగా ప్రకటించుకున్నారు. ఇప్పుడు దశరథరావు లేవదీసిన సమస్య ఒక మహాసందిగ్ధసమరంలో తిష్ఠవేసుకుంది.

అతడు తల్లితండ్రుల అపరిమిత వాత్సల్యాన్ని పోనాడుకున్నాడు, మిత్రులసానుభూతి వాక్యాలకిదూరమయ్యాడు; సనాతనుల్ని ఎదిరించాడు; అధునాతనుల్ని విస్మరించాడు: ఒక భయంకర కల్లోలాన్ని సృష్టించి, తను సృష్టించిన ప్రకృతిని చూసి అమానుషంగా నవ్వుకుంటూ ఎక్కడో కూర్చున్నాడు దశరథరావు.

అతనికి నచ్చచెప్పి ఒప్పించగల సామ్రాట్టులూ లేకపోయారు. అతనికి వంగి అతనిధైర్యాన్ని ప్రశంసించే వైతాళికులూ లేకపోయారు. అతని తత్వాన్ని విమర్శించి, తప్పిదాన్ని ఎత్తిచూపే తాత్వికులూ లేకపోయారు. అతని తీవ్రత్వాన్ని ఆచరించి సాధించే శిష్యపరమాణువులూ లేకపోయారు. నిర్వికార, నిరంజన, నిర్గుణరూపుడయ్యాడు దశరథరావు.